అభివృద్ధి చేశా.. ఆదరించండి

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం హెగ్డోలిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్

- సంక్షేమ పథకాల్లో మనమే టాప్
- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దు
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి, నవంబర్ 11 : సీఎం కేసీఆర్ సహకారంతో వేల కోట్ల నిధులు తీసుకొచ్చి బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని స్పీకర్, బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి పల్లె అభివృద్ధి చెందిందని, సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా నిలిపిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. శనివారం నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలు చెబుతూ ఓట్ల కోసం వస్తున్నారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంటున్నాడని, గాంధీభవన్‌లో నిత్యం గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలకు బాన్సువాడలో అభ్యర్థులు కరువయ్యారని చివరకు ఇతర జిల్లాల నుంచి అభ్యర్థులను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే చేతులు ఎత్తేశారని గుర్తు చేశారు. కాగా పొతంగల్ మండలం టాక్లీ గ్రామ ఉప సర్పంచ్ బలరాం స్పీకర్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శనివారం నిజామాబాద్ నగరంలో నిర్వహించిన గోసంగి కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బీసీల సీట్లను అమ్ముకొన్న కాంగ్రెస్

- సీట్లు విక్రయించి రేటెంత రెడ్డిగా మారిన టీపీసీసీ చీఫ్
- మూడోసారి సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారు
- గోసంగి కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 11 : కాంగ్రెస్ పార్టీ బీసీల సీట్లను కోట్లకు అమ్ముకొన్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బీసీల స్థానంలో టికెట్లను అగ్రవర్ణాలకు కట్టబెట్టిందని విమర్శించారు. సీట్లు అమ్ముకొన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన పేరును రేటెం త రెడ్డిగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన గోసంగి కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 8 జనరల్ సీట్లకు గాను గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు నాలుగు సీట్లు ఇచ్చిందని, ఈ సారి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని తెలిపారు. బీసీల సీట్లను కోట్ల రూపాయలకు అమ్ముకొని అగ్రవర్ణాలకు అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు ఒక్క సీటు కూడా ఇవ్వని జిల్లాకు వచ్చి బీసీ డిక్లరేషన్ చేయడం హాస్యాస్పదంగా ఉన్నదని అన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అ య్యి రికార్డు సృష్టిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతుబంధును రైతులకు వేస్తున్న బిచ్చమని రేవంత్‌రెడ్డి అంటున్నారని, వారి అహంకారానికి అడ్డూ అదుపు లేకుండా పోతున్నదని మం డిపడ్డారు. అధికారంలో లేనప్పుడే ఇంత అహంకారాన్ని ప్రదర్శిస్తుంటే ఇక పొరపాటున అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతల పనులు ఎలా ఉంటాయో ఆలోచించాలని సూచించా రు. రేవంత్‌రెడ్డి కామారెడ్డికి వచ్చి కాలు దువ్వుతున్నాడని విమర్శించారు.కర్ణాటక ప్రజలు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తుంటే ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య తెలంగాణకు వచ్చి బీసీలకు అవి చేస్తాం, ఇవి చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. కర్ణాటకలో కరెంటు, సాగు నీరు లేదని.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడంలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ఓడించేందుకు కుట్ర

- ఎవరేం చేసినా కేసీఆర్ హ్యాట్రిక్
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, నవంబర్ 11 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యమని ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అస్థిరపర్చేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేని శక్తులన్నీ ఏకమవుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శనివారం ఆయన నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఎవరెన్ని మాట్లాడినా, ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలుగా మభ్యపెట్టినా తెలంగాణకు ముచ్చటగా మూడోసారి కేసీఆరే ముఖ్యమంత్రి అని స్పష్టం చేశారు. గతంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన పార్టీలన్నీ ఈ ఎన్నికల్లో ఏకమై కేసీఆర్‌కు వ్యతిరేకంగా చేతులు కలుపుతున్నాయని విమర్శించారు. మొన్నటి వరకు ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ పాదయాత్రలు, ఆర్భాటపు ప్రకటనలు చేసిన వాళ్లంతా ఇప్పుడెందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదిన్నరేండ్లలోనే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ దూసుకుపోతున్నదని తెలిపారు.

వృద్ధురాలికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్వపరిపాలన కోసమే తండాలు జీపీలుగా మార్పు

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, నవంబర్ 11: స్వపరిపాలన కోసమే సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, వాటి అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించి తొమ్మిదిన్నరేండ్లలో రూపురేఖలు మార్చారని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ తాగు, సాగునీరు, మౌలిక వసతులు కూడా కల్పించలేదని మండిపడ్డారు. ఇలాంటి పార్టీకి ఓటు ఎందుకు వేయాలని ప్రజలు ఆలోచించాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు తండాల బాగోగులను పట్టించుకోలేదని విమర్శించారు.

స్పృహ రావడంతో హఫీజ్‌తో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

కొప్పుల మానవత్వం

- ఫిట్స్ వచ్చిన పార్టీ నేతను దవాఖానలో చేర్పించి చికిత్స

ధర్మారం, నవంబర్11: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మానవత్వాన్ని చాటారు. ఎన్నికల ప్రచారం కోసం ధర్మారం మండలం నర్సింగాపూర్‌కు వెళ్లి, శనివారం రాత్రి తిరిగి ధర్మపురికి వెళ్తున్నారు. ఎర్రగుంటపల్లి శివారులో ఓ కారు అదుపుతప్పి కనిపించింది. మంత్రి ఈశ్వర్ తన కాన్వాయ్‌ను ఆపి పరిశీలించగా, సదరు వ్యక్తి బీఆర్ఎస్ మైనార్టీసెల్ మండలాధ్యక్షుడు ఎండీ హఫీజ్‌గా గుర్తించారు. వెంటనే తన కాన్వాయ్‌లో హఫీజ్‌ను ధర్మారంలో హఫీజ్ నిర్వహిస్తున్న దవాఖానకు తీసుకెళ్లారు. మంత్రి ఈశ్వర్ దగ్గర ఉండి చికిత్స చేయించారు. కాగా, విషయం తెలుసుకున్న హఫీజ్ తల్లిదండ్రులు దవాఖానకు చేరుకున్నారు. తన కొడుక్కు చికిత్స చేయించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గ్యారెంటీలు గంగలో కలిసినట్టే

ఖమ్మంలో ఎన్నికల ప్రచారంలో డప్పు కొడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

- సీఎం కేసీఆర్ హామీలు ఇస్తే.. వాటిని పక్కాగా అమలు చేస్తారు
- ఖమ్మం రోడ్‌షోలో మంత్రి అజయ్

ఖమ్మం, నవంబర్ 11: గ్యారెంటీ లేని కాంగ్రెస్ ఇచ్చే హామీలన్నీ గంగానదిలో కలిసినట్టేనని రవాణా మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ ధీమాను ఇస్తుందని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారంటే దానిని పక్కాగా అమలుచేస్తారని చెప్పారు. శనివారం ఖమ్మంలోని 25, 26, 37, 38వ డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించారు. చర్చి కాంపౌండ్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో రిక్కాబజార్, కమాన్‌బజార్, కస్సాబజార్, పాత మున్సిపల్ కార్యాలయం మీదుగా ఖిల్లాలోకి ప్రవేశించింది. ఆయా వీధుల్లో పువ్వాడ అజయ్ ఓటర్లను పలుకరిస్తూ.. తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఖమ్మం నగరంలోని చర్చి కాంపౌండ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కళాకారులతో కలిసి డప్పు కొట్టి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అనేక పథకాలను తానే స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఖమ్మం నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. ఎంతో కష్టపడి అభివృద్ధి చేసుకున్న ఖమ్మాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టి మళ్లీ ఆగం చేసుకోకూడదని సూచించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

బీపీఈడీ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

కర్ణాటక, మహారాష్ట్రలో కరెంటుకు కటకట

- మానాల ప్రచారంలో మంత్రి వేముల

మానాల గ్రామంలో మంత్రి వేములకు తిలకం దిద్దుతున్న మహిళ

కమ్మర్‌పల్లి, నవంబర్ 11: కర్ణాటకలో వ్యవసాయానికి 10 గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఓట్లు వేయించుకొని అప్పటికే ఉన్న ఏడు గంటల కరెంటును ఎగ్గొట్టిందని, బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కావాలంటే రూ.1.80 లక్షలు కట్టాలని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కానీ తెలంగాణలో కేసీఆర్ ఉచితంగా కరెంటు ఇవ్వడగే గాక, పంట పెట్టుబడి సాయం అందిస్తున్నారని తెలిపారు. శనివారం మంత్రి నిజామాబాద్ జిల్లా మానాలతోపాటు బడితండా, దేగావత్‌తండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఆలోచింపజేస్తున్న బీఆర్ఎస్ 'బలగం' యాడ్స్

బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన 'బలగం' యాడ్స్‌లోని ఓ సన్నివేశం

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం 'బలగం' సినిమా థీమ్‌తో బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన యాడ్స్ ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. శనివారం విడుదలైన ఈ ప్రకటనలు పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో వైరల్‌గా మారాయి. బలగం నేపథ్యంలో పార్టీ రూపొందించిన ఈ ఐదు యాడ్‌లు సినిమా థియేటర్లలో, టీవీల్లో ప్రదర్శించేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే వినూత్నరీతిలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీ తెలుగులో విజయవంతమైన 'బలగం' సినిమా థీమ్‌తో ప్రస్తుతం రూపొందించిన ఈ యాడ్స్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేండ్లలో సాధించిన విజయాలను, పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను, అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించడం కోసం బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాల్సిన అవసరాన్ని ఈ లఘు చిత్రాల్లో సృజనాత్మకంగా పొందుపర్చారు. ఈ ఏడాది మార్చిలో విడుదలైన 'బలగం' సినిమా సంచలనం సృష్టించింది. తెలంగాణ లో వ్యక్తుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన ఈ చిత్రం.. ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొని అపూర్వ విజయాన్ని అందుకున్నది. గ్రామగ్రామాన ప్రొజెక్టర్లు, స్క్రీన్ల మీద ప్రదర్శించిన ఈ చిత్రానికి అన్నివర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

తుల ఉమతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ, ఆగయ్య

తుల ఉమను కలిసిన బీఆర్ఎస్ నేతలు

వేములవాడ, నవంబర్ 11: వేములవాడ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ తుల ఉమను రాజన్న సిరిసిల్ల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకుడు దరువు ఎల్లన్న ఆదివారం రాత్రి పట్టణంలోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తుల ఉమను బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. తన అనుచరులతో కలిసి నిర్ణయం తీసుకుంటానని తుల ఉమ వారికి తెలిపారు.